క్లుప్తంగా

ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు గడువు పొడిగించాలి

కర్నూలు(సెంట్రల్): ఎస్ఐ మెయిన్స్ పరీక్షలకు రెండు నెలలపాటు గడువును పొడిగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం జెడ్పీలోని గాంధీ విగ్రహం ఎదుట ఎస్ఐ మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు నిరసన తెలిపారు. ఇటీవల ఫిజికల్ టెస్టు పరీక్షలు ముగిశాయని, మెయిన్స్‌కు ఈవెంట్స్‌కు కనీసం 45 రోజుల సమయం ఉండాలనే నిబంధన పాటించకుండా ఈ నెల 14, 15 తేదీల్లో మెయిన్స్ నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం తగదన్నారు.

రైతులకు పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): చెన్నై – సూరత్ జాతీయ రహదారిలో భూములు కోల్పోతున్న అన్నదాతలకు వెంటనే పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఉల్చాల, సింగవరం, బసాపురం గ్రామాల్లో రహదారి కోసం తీసుకున్న భూములను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాతీయ రహదారి కోసం దిన్నెదేవర నుంచి ఆర్ కొంతలపాడు వరకు 12 గ్రామాల్లో 386 ఎకరాలను రైతులు కోల్పోతున్నారన్నారు. వారికి ఎకరాకు రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, తిమ్మప్ప, మద్దయ్య, ఉస్మాన్‌బాషా, లక్ష్మన్న, రంగన్న, నాగార్జున పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్ల అర్ధనగ్న ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ క్లాప్ డ్రైవర్లు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లు కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగారు. ఈసందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్‌దేశాయ్, మార్కెల్ల విజయ్ మాట్లాడుతూ 10 నెలల నుంచి క్లాప్ డ్రైవర్లకు వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. జీతాలు అడగడంతో తొలగించడం అన్యాయమన్నారు. మునిసిపల్ కమిషనర్ స్పందించి తొలగించిన వారిని విధుల్లోకి తీసుకొని పెండింగ్ వేతనాలు ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, నరసింహులు మోహిదీన్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీఈడీ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనంద రావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 కేంద్రాల్లో జరుగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 3,807 మందికి గానూ 3,410 మంది హాజరయ్యారన్నారు. ఆయా పరీక్షాకేంద్రాల్లో 397మంది గైర్హాజరయ్యారన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయండి

కర్నూలు (న్యూసిటీ): మండలంలోని రేమట గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఆర్వీపీఎస్ (రాయలసీమ విద్యార్థి పోరాట సమితి) రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ కోరారు. బుధవారం ఆయన ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు.

కిడ్స్ వరల్డ్‌కు సలాంఖాన్ సర్కిల్‌గా పేరు పెట్టండి



ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌డీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కిడ్స్ వరల్డ్ ఏరియాకు సలాంఖాన్ సర్కిల్‌గా పేరు పెట్టాలని చేయాలని ఎస్‌డీపీఐ రాష్ట్ర నాయకులు జహంగీర్ అహ్మద్ మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌లను కోరారు. బుధవారం వారు వేర్వేరుగా మేయర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అష్పాక్ హుస్సేన్ నాయకులు చాంద్‌బాషా, అబ్దుల్లా, హబీబుల్లా, అబ్దుల్‌సలాం పాల్గొన్నారు.

నేడు, రేపు న్యాయవాదులు విధుల బహిష్కరణ

కర్నూలు (లీగల్): రెండు రోజుల పాటు విధులు బహిష్కరించనున్నట్లు న్యాయవాదులు బుధవారం తెలిపారు. న్యాయస్థానాల్లో రోజూ అధిక సంఖ్యలో న్యాయవాదులు తమ కక్షిదారుల తరఫున పిటిషన్లు దాఖలు చేస్తారు. పిటిషన్లకు రూ.1 స్టాంపు అతికిస్తారు. గురువారం నుంచి రూ.1 స్టాంపుతో పాటు అదనంగా రూ.20 స్టాంపు అతికించాలని బార్ కౌన్సిల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేయడంతో కర్నూలు న్యాయవాద సంఘ కార్యవర్గం వ్యతిరేకించింది. అందుకు నిరసనగా గురు, శుక్రవారాల్లో తమ విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేయాలని తీర్మానించింది. అలాగే సత్యసాయి జిల్లా పెనుగొండలో న్యాయవాదిపై జరిగిన దాడిని ఖండించారు. విజయవాడలో న్యాయవాదుల ఇళ్లలో ఎన్ఐఏ సోదాలు చేయడాన్ని కార్యవర్గం ఖండిస్తూ తీర్మానం చేసింది.

ముగ్గురిపై చీటింగ్ కేసు

కర్నూలు (అర్బన్): తన సంతకం ఫోర్జరీ చేసి రూ.7.40 లక్షలు కారు లోను తీసుకున్నారని మాధవీ నగర్‌కు చెందిన మధుసూదన్ ఫిర్యాదు మేరకు నగరానికి చెందిన శివబాల నాగేంద్ర గుప్త, అతని భార్య, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ మేనేజర్‌పై కేసు నమోదు చేసినట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.

అవినీతికి తావులేదు

● ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



గడపగడప కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కర్నూలు (రాజ్‌విహార్): పేదలకు అందించే సంక్షేమ పథకాలలో అవినీతికి తావు లేదని ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. బుధవారం 23వ వార్డు శ్రీరాం నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో కలసి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం నవరత్నాల పథకాలను తీసుకొచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలు అమలు చేస్తుండటంతో ప్రజలు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. వలంటీర్లే ఇంటి వద్దకు వచ్చి ప్రక్రియ చేపట్టడం కేవలం మన రాష్ట్రానికే గర్వకారణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో తెలుగు దేశం పార్టీ నేతలు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. అర్హత లు చూడకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు, డబ్బులు ఇచ్చిన వారికి మాత్రమే పథకాల మంజూరుకు సిఫారసు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రతి పథకం పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుచరిత రాణి, సునిల్, ఏసన్న, గిరిధర్, ప్రవీణ్, బలరాం, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్‌సీ ప్రక్రియలో పాల్గొనండి

● రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ విజ్ఞప్తి



ఎన్నికల పరికరాల పనితీరును పరిశీలిస్తున్న అధికారులు, రాజకీయ పార్టీల నేతలు

కర్నూలు(సెంట్రల్): ఈ నెల 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు చేపట్టే ఎలక్ట్రానిక్ పరికరాల ఫస్ట్ లెవల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియలో రాజకీయ పార్టీలు పాల్గొనాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన కోరారు. బుధవారం సాయంత్రం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఓటరు సవరణ జాబితా -2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎఫ్ఎల్‌సీ ప్రక్రియలో భాగంగా మాదిరి ఎన్నికలు జరిగేటట్లు పరికరాలను పరిశీలించుకోవచ్చన్నారు. ఇందుకోసం రాజకీయ పార్టీలు తమ ప్రతినిధులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాకు 7020 బ్యాలెట్ యూనిట్లు, 5460 కంట్రోల్ యూనిట్లు, 6650 వీవీప్యాట్ యూనిట్లు వచ్చినట్లు చెప్పారు. ఆయా పరికరాల పనితీరును మొదటి దశలో బెల్ ఇంజినీర్లు, ఎన్నికల సంఘం అధికారుల ఆధ్వర్యంలో పరీక్షించనున్నట్లు చెప్పారు. అనంతరం ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను ఏ విధంగా చేపడతారో రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎన్నికల గోదాములో సిబ్బంది చూపించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదనరావు, వైఎస్సార్‌సీపీ నుంచి పుల్లారెడ్డి, కాంగ్రెస్ నుంచి సత్యనారాయణగుప్తా, జాన్ విల్సన్, బీఎస్పీ నుంచి అరుణ్‌కుమార్, టీడీపీ నుంచి చంద్రహాస పాల్గొన్నారు.

కేసులను సత్వరం పరిష్కరించాలి

కర్నూలు కల్చరల్: అక్రమ కలప రవాణా, ఎర్రచందనం అపహరణ కేసులను సత్వరం పరిష్కరించాలని అటవీశాఖ విజిలెన్స్ అడిషినల్ పీసీసీఎఫ్ గోపీనాథ్, కంపా అడిషినల్ పీసీసీఎఫ్ బి.కె.సింగ్ జిల్లా అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం వారు విజయవాడ నుంచి డీఎఫ్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాంపెన్సేటరీ అఫోర్‌స్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (సీఏఎంపీఏ) స్కీం అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ వణీకరణ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు అటవీ శాఖ అధికారి శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

8న సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో, శ్రీశైలం అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం, నివృత్త భూగర్భ జలశాఖ విశ్రాంత అధికారి ముచ్చుకోట చంద్రశేఖర్ సౌజన్యంతో ఈనెల 8న గ్రంథాలయ తాతయ్య ముచ్చుకోట వెంకటరామయ్య జయంత్యుత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో సదస్సు ఉంటుందన్నారు. 'మహా భారతం– సభా పర్వం' అంశంపై తిరుపతి శతావధాని డాక్టర్ ఆముదాల మురళి ప్రసంగిస్తారని, సాహితీ వేత్తలు, సాహితీ ప్రియులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయాల ఆస్తులను పరిరక్షించాలి

● దేవదాయ శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్



సమీక్ష నిర్వహిస్తున్న దేవదాయ శాఖ డీసీ పట్టెం గురుప్రసాద్

కర్నూలు కల్చరల్: ఆలయాల ఆస్తులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని దేవదాయ శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ అన్నారు. బుధవారం కర్నూలు డీసీ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల అసిస్టెంట్ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. సమీక్ష సమావేశానికి హాజరు కాని ఐదుగురు ఈఓలకు మెమో ఇవ్వాలని డీసీ కార్యాలయ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆలయాల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. అర్చకుల గ్రీవెన్స్‌ను సకాలంలో పరిష్కరించి సమాధానం ఇవ్వాలన్నారు. సనాతన ధర్మ ప్రచారంలో భాగంగా ప్రతి ఈఓ సంబంధిత ఆలయాల్లో వారోత్సవాలు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆలయ చరిత్ర, ప్రాశస్త్యం గురించి ప్రచారం కల్పించాలన్నారు. ఆధ్యాత్మిక శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదించాలన్నారు. సీజీఎఫ్ బకాయిలు వసూలు చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు, నంద్యాల అసిస్టెంట్ కమిషనర్లు రామాంజనేయులు, సుధాకర్ రెడ్డి, డీసీ కార్యాలయం సూపరింటెండెంట్లు పాండురంగారెడ్డి, ప్రశాంతి, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, హరిశ్చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ సెక్రటరీగా ఎస్.ఇలియాస్‌బాషా



కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎస్ ఇలియాజ్‌బాషా అఖిల భారత ప్రభుత్వ డ్రైవర్ల సమాఖ్య (ఆల్ ఇండియా గవర్నమెంట్ డ్రైవర్స్ ఫెడరేషన్) జాయింట్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈ నియామకాన్ని ఖరారు చేయగా... బుధవారం ఇలియాజ్‌బాషాకు సమాఖ్య సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ హమీద్ నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు.

పెద్దాసుపత్రికి వీల్‌చైర్లు, స్ట్రెచర్లు విరాళం



వైద్యసామగ్రిని ఆసుపత్రికి అందిస్తున్న సద్గురుదత్త కృపాలయం సిబ్బంది

కర్నూలు (హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు శ్రీసద్గురుదత్త కృపాలయం వారు బుధవారం 15 వీల్ చైర్లు, 15 స్ట్రెచర్లు, 20 బీపీ ఆపరేటర్లు, 10 సక్షన్ ఆపరేటర్లను విరాళంగా అందజేశారు. దాదాపు రూ.5 లక్షలు విలువ చేసే వీటిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆసుపత్రిలో సద్గురుదత్త కృపాలయం వారు దాదాపు 12 సంవత్సరాల నుంచి రోగుల సహాయకులకు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం అందిస్తూ సేవ చేస్తున్నారని అన్నారు. దీంతో పాటు చనిపోయినవారికి స్మశాన వాటికకు తరలించేందుకు ఉచితంగా వైకుంఠ క్షేత్రం వాహనాలు నడుపుతున్నారని, ఇలాంటి సేవలు అందించడం ఎంతో అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, సద్గురుదత్త కృపాలయం సిబ్బంది మల్లారెడ్డి, శ్రీధర్, రాకేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జూనియర్ కళాశాలల క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 6 నుంచి జూనియర్ కళాశాలల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న స్విమ్మింగ్ పోటీలు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో, రైఫిల్ షూటింగ్ పోటీలు అశోక్‌నగర్‌లోని ఆర్‌కే అకాడమీలో, 7న రగ్బీ, రోప్ స్కిప్పింగ్ పోటీలు బి.క్యాంప్ బాలికల క్రీడామైదానంలో, 9 న బాస్కెట్ బాల్, టెన్నికాయిట్ పోటీలు సిల్వర్‌జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో, 10న జూడో పోటీలు నందికొట్కూరులోని నంది కళాశాల క్రీడామైదానంలో, 11న జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ పోటీలు స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

సకాలంలో టీకాలు వేయించాలి



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు (హాస్పిటల్): గర్భిణులకు, ఐదేళ్లలోపు చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన డాక్టర్స్ కాలనీలోని యూపీహెచ్‌సీ పరిధిలో ఉన్న మాధవీ నగర్ సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాలు వేసిన వారి వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌టీహెచ్, యువిన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీనివలన పిల్లలను వ్యాధుల బారి నుంచి కాపాడవచ్చన్నారు. గర్భిణులను 12 వారాలలోపు నమోదు చేసుకుని సమయానికి ఆరోగ్య సేవలు అందించాలని, వారు కాన్పునకు వెళ్లాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఏఎన్ఎం యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. ప్రమాదకర చిహ్నాలు ఉన్న గర్భిణులను ముందుగానే గుర్తించి కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కమ్యూనిటీ మొబలైజర్ ప్రసాద్ ఉన్నారు.

ఆరోగ్య సురక్ష శిబిరం తనిఖీ



వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ హేమలత

కర్నూలు సిటీ: మండలంలోని ఈ-తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే) ఆఫీసర్ డాక్టర్ హేమలత పరిశీలించారు. వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులతో పాటు, దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యం అందిస్తారని, వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కర్నూలు ప్రభుత్వాస్పత్రి వైద్యులు రంగనాథ్, అశ్వినికుమార్, విజయమాధురీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు ప్రధాని సంకెళ్లు



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): పత్రికా స్వేచ్ఛకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంకెళ్లు వేస్తున్నారని న్యాయవా ద, జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈసందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులు స్టాండ్ అప్ కమెడియన్‌లు, వ్యంగ్య రచయితలు, శాస్త్రవేత్తలు, సాంస్కృతిక చారిత్రకారులు, వ్యాఖ్యాతల ఇళ్లపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిపై ఉపా చట్టాన్ని ప్రయోగించడం ద్వారా మీడియా స్వేచ్ఛను హరిస్తున్నారన్నారు. మోదీప్రభుత్వం బీబీసీ, న్యూస్‌లాండ్రి, దైనిక్ భాస్కర్, దివైర్, వంటి మీడియా సంస్థలను అణచి వేయడానికి, భయపెట్టడానికి దర్యాప్తు సంస్థలను ప్రయోగించారన్నారు. ఇప్పుడు న్యూస్ క్లిక్, దానితో సంబంధం ఉన్న వారిపై దాడులు చేయడం హేయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఆనందబాబు, నాగేంద్ర, కెంగార కుమార్, డి. వెంకటస్వామి, ఎంఎండీ షరీఫ్ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కర్నూలు (లీగల్): మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర పోస్టర్‌ను బుధవారం మాదిగ లాయర్ ఫెడరేషన్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రవికాంత్ ప్రసాద్ మాట్లాడుతూ మాదిగల మాదిగ ఎ, బి, సి, డి వర్గీకరణ కోసం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ మందకృష్ణ ఈనెల 5న చలో అలంపూర్, నవంబర్ 7న హైదరాబాదులో చేపట్టిన పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ సీనియర్ నాయకుడు మాదన్న, జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి బల్గర్ హుసేన్, రాజేష్, శ్యామ్, జగదీష్ పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొట్టిన ముగ్గురు డాక్టర్లు

● ఆగ్రహంవ్యక్తం చేసిన సూపరింటెండెంట్
● వైద్యులకు మెమోలు జారీ



క్యాజువాలిటీలో విచారణ చేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు డుమ్మా కొట్టారు. బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేసిన సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి విషయాన్ని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముగ్గురికీ మెమోలు జారీ చేశారు. క్యాజువాలిటీ విభాగంలో డ్యూటీ డాక్టర్‌గా జనరల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ న్యూటన్ ఇసాక్, జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రణీత్, ఆర్థో అసిస్టెంట్ డాక్టర్ సత్యనారాయణ బుధవారం విధులు నిర్వహించాల్సి ఉంది. సాయంత్రం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి క్యాజువాలిటీని తనిఖీ చేసిన సమయంలో వీరు ముగ్గురూ విధుల్లో లేనట్లు గుర్తించారు. వారి గురించి ఆరా తీసిన అనంతరం ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమోలు జారీ చేశారు. క్యాజువాలిటీలో నిత్యం రద్దీగా ఉండే వేళల్లో డ్యూటీ డాక్టర్లు విధుల్లో లేకపోవడం సహించరానిదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సింది పోయి విధులకు డుమ్మా కొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

పోషకాహార లోపం తరిమేద్దాం



పోషకాహార లోపం నివారణ పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): సమాజంలో పోషకాహార లోపాన్ని తరిమికొడదామని మహిళా కమిషన్ సభ్యులు రుఖియా బేగం, జి.లక్ష్మి అన్నారు. బుధవారం బీ.క్యాంప్‌లోని అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో రాష్ట్రీయ పోషన్ మా–2023 సందర్భంగా వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. బాలికలతో పాటు అబ్బాయిల్లోనూ ఈ సమస్య కనిపిస్తోందన్నారు. దీనిని నివారించేందుకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఐసీడీఎస్ ఆర్‌జేడీ పద్మజ మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, న్యాయవాది శ్రీవిద్య, ఇతర జిల్లాల సీడీపీఓలు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు.

కలెక్టర్‌ను కలిసి గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు



కలెక్టర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజనను క్యాంప్ ఆఫీస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన శోభాయాత్ర విజయవంతం కావడానికి సహకరించిన కలెక్టర్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షులు కె.క్రిష్టన్న, జిల్లా సమన్వయ కార్యదర్శి డాక్టర్ నాగఫణి శాస్త్రి, నగర ఉపాధ్యక్షులు కగ్గోలు హరీష్ బాబు, సభ్యులు దేవకి దేవి, మామిళ్ల పల్లి రాజేష్ శర్మ, నాగోజి ఉన్నారు.

ఫ్రైడ్ చికెన్ సెంటర్లపై విజిలెన్స్ దాడులు

కర్నూలు: ఫ్రైడ్ చికెన్ సెంటర్స్‌లో ఆహార నాణ్యత, వినియోగిస్తున్న సరుకుల నాణ్యతపై ఫిర్యాదుల నేపథ్యంలో కర్నూలులోని మూడు వేర్వేరు ఫ్రైడ్ చికెన్ సెంటర్స్‌పై విజిలెన్స్ అధికారులు.. ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. మూడు బృందాలుగా ఏర్పడి బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. శ్రీరామ టాకీస్ సమీపంలోని సిటీ స్క్వేర్ మాల్‌లో ఉన్న కేఎఫ్‌సీ (దుకాణం), భాగ్య నగర్‌లో ఉన్న కేజే కాంప్లెక్స్‌లోని ప్యారడైజ్ బిర్యానీ పాయింట్ (హోటల్), మౌర్య ఇన్ కాంప్లెక్స్‌లో ఉన్న ఫుడ్ ప్యారడైజ్ హోటల్ (డొమినోస్ పిజ్జా)లో తనిఖీలు నిర్వహించారు. వీటిలో పరిసరాల పరిశుభ్రత, వంట నూనెల నాణ్యత, వాడుతున్న నిత్యవసరాలు, ఆహార పదార్థాలను శాంపిల్స్ సేకరించారు. పన్నీరు, చికెన్ టిక్కా, చికెన్ ఫ్రైడ్ తదితర వాటిని శాంపిల్స్ తీసి పరిశీలన నిమిత్తం హైదరాబాదులోని ల్యాబ్‌కు పంపారు. సీఐలు నాగరాజు యాదవ్, రామకృష్ణ, సునిల్‌కుమార్, తహసీల్దార్ వెంకటనారాయణ, ఏజీ సిద్ధయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్ తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు



పతకంతో విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: స్కూల్‌గేమ్స్ పోటీల్లో ఈ-తాండ్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తబుసుం ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినిని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అభినందించారు. హెచ్ఎం లక్ష్మిశైలజ మాట్లాడుతూ తమ విద్యార్థిని తబుసుం వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పీఈటీ బి.జయగణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత హస్తకళా ప్రదర్శన ప్రారంభం



చేనేత హస్తకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని బి.క్యాంప్ విజ్ఞాన మందిరంలో బుధవారం సాయంత్రం చేనేత హ్యాండీక్రాఫ్ట్ హస్తకళా ప్రదర్శనను వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే చేనేత వస్త్రాలను ఆదరిద్దామన్నారు. చేనేత హస్తకళా ప్రదర్శన నిర్వాహకులు పసుపులేటి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని, చేనేత వస్త్రాలతో పాటు వస్తువులు, కళంకారి వస్తువులకు డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గురజాల ఈఓపై డీసీకి ఫిర్యాదు

కర్నూలు కల్చరల్: నందవరం మండలం గురజాల రామలింగేశ్వర స్వామి ఆలయ ఈఓ దినేష్‌పై డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌కు ఆలయ చైర్మన్ పెద్ద నరసింహులు ఫిర్యాదు చేశారు. ఈఓ ఆలయానికి రావడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని, దసరా ఉత్సవాలు నిర్వహించాలో లేదో కూడా స్పష్టత లేదని బుధవారం కర్నూలు డివిజన్ దేవదాయ శాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌కు చైర్మన్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన.. ఈఓకు మెమో ఇచ్చి వివరణ కోరాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. దసరా ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది ఉండదని చైర్మన్‌కు హామీ ఇచ్చారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కర్నూలు సిటీ: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సెట్కూరు సీఈఓ పీవీ రమణ, దిశా పోలీసు స్టేషన్ సీఐ కళా వెంకటరమణ సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైం అంశాలపై సెట్కూర్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీసాయి డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు అవగాన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెడు అలవాట్లు దూరంగా ఉండాలన్నారు. చదువుపై నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. విద్యార్థినులు దిశా యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ జానీబాషా, సెట్కూరు మేనేజర్ జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హిందువుల సంఘటితానికే శౌర్య జాగరణ యాత్ర

కర్నూలు కల్చరల్: హిందువులను సంఘటితం చేసేందుకే విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర నిర్వహిస్తున్నామని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి, జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, భజరంగ్ దల్ దక్షిణాంధ్ర ప్రాంత కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నగర కార్యదర్శి నాగరాజు, జిల్లా మాతృశక్తి కన్వీనర్ జంపాల రాధిక తెలిపారు. బుధవారం నగరంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం, కేసీ కెనాల్ రోడ్, శ్రీకృష్ణ కాలనీ, ఎల్కూరు బంగ్లా, ఉల్చాల రోడ్, ఎన్టీఆర్ బిల్డింగ్స్, మాసా మసీద్, సీతారామాంజనేయ స్వామి ఆలయం, కొండారెడ్డి నగర్, భవాని శంకర ఆలయం ప్రాంతాల్లో శౌర్య జాగరణ యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ వరకు జిల్లాలో యాత్ర జరుగుతుందన్నారు.

ఏసీపీకి అదనపు బాధ్యతలు

కర్నూలు (టౌన్): నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం సహాయ సిటీ ప్లానర్ శశిలతకు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. జిల్లా గ్రామీణ, పట్టణ ప్రణాళిక అభివృద్ధి సంస్థకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ విభాగం డైరెక్టర్ విద్యుల్లత బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.